క్లుప్తంగా

అమ్మా.. కరుణించు

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. యాసంగి వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. దీంతో భక్తుల రద్దీ తగ్గిందని ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్: మండలంలోని అంకిరావుపల్లిలో ఆదివారం బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు గుర్తును చూపిస్తూ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించారు. బీఎస్పీతోనే బహుజన రాజ్యం సాధ్యమని మండల అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. నాయకులు బంకల దాసు, తదితర నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్, అచ్చంపేట, జడ్చర్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మర్రిజనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, లక్ష్మారెడ్డిలు ఆదివారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్‌లు అందుకున్నారు. ఈమేరకు ఆయా నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. పటాకులు కాల్చి స్వీట్లు ఒకరికొకరు తినిపించుకున్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కృష్ణయ్య(45) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఆయన స్వగ్రామమైన మారెడెమాన్‌దిన్నెలో గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి తండా, తిప్పాపూర్ తండాకు చెందిన కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే వారికి పార్టీ కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలుచేయబోయే ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి, రఘుపతిరెడ్డి, నర్సింహ్మారావు, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొల్లాపూర్: పట్టణంలో ఇటీవల వేర్వేరు కారణాలతో ఒకే రోజు మరణించిన తండ్రి, కొడుకులు కర్నె కురుమయ్య, శివయ్యల కుటుంబానికి ఆదివారం యువ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.5 వేలు, మూలె నారాయణ కుటుంబీకులు రూ.7 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్, మూలె రమేష్, దామోదర్, ఆంజనేయులు, మేఘనాథ్, శివశంకర్ న్నారు.

పెబ్బేటి నిరంజన్‌కు పూలే ఉత్తమ అవార్డు



ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లికి చెందిన పెబ్బేటి నిరంజన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఉత్తమ అవార్డు దక్కింది. ఈమేరకు ఆదివారం ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ జాతీయ అవార్డును అందజేశారు. జాతీయ అవార్డును పొందడటం పట్ల నిరంజన్‌ను పలువురు అభినందించారు.



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



ఉమామహేశ్వరం ఆలయంలో



అచ్చంపేట భక్తమార్కండేయ శివాలయంలో..

జగన్మాతకు జేజేలు

- వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

కందనూలు: దసరా పండుగ పురస్కరించుకొని నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల శివాలయం నుంచి కలశం, ఉత్సవ విగ్రహ శోభాయాత్ర కనులపండువగా నిర్వహించారు. శివాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిగిదొడ్డి శ్యాంసుందర్ దంపతులు, వాసా రమేష్ దంపతులు పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మాచి పెద్ది శివకుమార్, హాకీం రాజేష్ ఏలిమే సత్యం, బిల్లా కంటి రవికుమార్, మిడిదటి చంద్రశేఖర్, ఆకుతోట మధుమోహన్, చిగుళ్లపల్లి రమణ, పోలిశెట్టి బాల చిదంబరం మిడిదొడ్డి రాధాకృష్ణ, పాల్గొన్నారు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కలశం ఊరేగింపు, పల్లకీ సేవ, కుంకుమార్చన, హనుమాన్ చాలిసా పారాయణం చేశారు. అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవి రూపంలో అలంకరించారు. ఆలయ చైర్మన్ రమేష్‌బాబు దంపతులు, శ్రీధర్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శులు రఘు, రాము, డాక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

అచ్చంపేట/రూరల్: నియోజకవర్గంలోని అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు, పదర, చారకొండ మండలాల పరిధిలో మొదటిరోజు ఆదివారం అమ్మవారిని బాల త్రిపుర సుందరిదేవీ అలంకరించారు. ఉమామహేశ్వర క్షేత్రం, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, భక్త మార్కండేయ శివాలయం, భ్రమరాంబ ఆలయాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వజ్రలింగం, ఆంజనేయులు ఉన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని కేదారేశ్వరాలయం, శాలివాహన వీధిలో, మండలంలోని కాంసానిపల్లి, పెద్దాపూర్, మర్రిపల్లి, తిర్మలాపూర్, లక్ష్మాపూర్‌లో, తాడూరు, వెల్టూరు, ఫిరట్వానిపల్లి, పెనిమిళ్ల తదితర గ్రామాల్లో దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. డాక్టర్ సురేష్, సంబు శోభ, జయమ్మ, ప్రభావతమ్మ, సరస్వతి, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్(కోడేరు): మండల కేంద్రంలోని శివాలయంలో బాల త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. గణపతి పూజ, కలశ స్థాపన, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు.

తాడూరు: యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు.



తాడూరులో



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో..



వెల్దండలో

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

మన్ననూర్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా కలుగుతుందని అచ్చంపేట ధ్యాన గురువు సాయి శంకర్ అన్నారు. ఆదివారం మన్ననూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ధ్యాన శాఖ సభ్యులు గ్రూపులుగా ఏర్పడి మన్ననూర్ గ్రామంలోని వివిధ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోనంద యోగీశ్వర భగవానుల దివ్య ఆశీస్సులతో ప్రచురించబడిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను గ్రామంలో జ్ఞాన ప్రచారం చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట ధ్యాన మందిర శాఖ అధ్యక్షుడు సాయి శంకర్, ఆంజనేయులు, చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ శాఖ సభ్యులు మనోహర్, స్వప్న మన్ననూర్ శాఖ సభ్యులు చంద్రమౌళి, కల్పన పాల్గొన్నారు.



పాల్గొన్న ధ్యాన గురువు సాయి శంకర్

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



అచ్చంపేటలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చారకొండ: మండలంలోని కల్వకుర్తి- దేవరకొండ ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వెల్దండ సీఐ సోమ నర్సయ్య, చారకొండ ఎస్‌ఐ రవి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నల్గొండ, కోదాడ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఎన్నికల కోడ్ సడలింపు వరకు తనిఖీలు కొనసాగుతాయని సీఐ పేర్కొన్నారు. రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కోడ్ నియమావళి ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పోలీసులు పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్, శ్రీశైలంకు వెళ్లే ప్రధాన రహదారుల్లో కార్లు, ఇతర వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు సహకరించాలని ఎస్‌ఐ గోవర్ధన్ కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జిలాని, కానిస్టేబుల్స్ మహేష్, అనీల్, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

తెల్కపల్లి: మండల కేంద్రంలోని ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూచుకుళ్ల రాజేష్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించడంతో ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాకులు కాల్చారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, రఘుకుమార్, అంజనేయులు, బిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కొల్లాపూర్(పెంట్లవెల్లి): కాంగ్రెస్ పార్టీ మొదటి విడత జాబితా విడుదలలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేరు ఖరారు చేయడంతో మండల కేంద్రంలోని బస్టాండు సర్కిల్‌లో ఆదివారం ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

మన్ననూర్: ఎమ్మెల్యే అభ్యర్థిగా వంశీకృష్ణ ఖరారు కావడంతో స్థానిక చౌరస్తాలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జిల్లా నాయకుడు వెంకటరమణ, ఎంపీటీసీలు రహీం, శ్రీను, నాయకులు మేరాజ్, శివాజీ, రెహమాన్, వెంకటయ్య, సుధాకర్, వెంకటేష్, మధు ఉన్నారు.

తాడూరు: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పేరు ఖరారు కావడంతో మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నాయకులు మల్లయ్య, నారాయణ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, యారకోటేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఖోఖో క్రీడలకు జిల్లా క్రీడాకారిణులు

కందనూలు: వనపర్తి జిల్లా, ఘనపురం మండలం సోలిపూర్‌లో ఆదివారం నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 ఖోఖో క్రీడల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరఫున నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు హేమలత, శ్రావణి పాల్గొన్నారు. వారు హైదరాబాద్ జిల్లా జట్టును ఓడించి మొదటి బహుమతి సాధించి జాతీయ ఖోఖో జట్టుకు ఎంపికయ్యారని నాగర్‌కర్నూల్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు తెలియజేశారు. త్వరలో జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో 67వ స్కూల్ గేమ్ ద్వారా నిర్వహించిన వివిధ క్రీడల్లో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. విద్యార్థులు హేమలత, శ్రావణి ఎంపిక కావడంపై డీఈఓ గోవిందరాజులు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు, ఎస్‌పిసి కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, వెంకటయ్య సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాష్, రమేష్, పురం రమేష్, అభినందించారు. క్రీడాకారులను తయారు చేసి జాతీయ స్థాయికి ఎంపికకు కృషి చేసిన పాఠశాల పీఈటీని అభినందించారు. జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి పాండు, ప్రసాద్‌గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో క్రీడలకు ఎంపికైన జిల్లా విద్యార్థులు

సారా పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: మండలంలో పెద్దాపూర్‌లో ఆదివారం ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన మాడ్గుల మాధవులు ఇంట్లో ఎనిమిది లీటర్ల సారాను పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అచ్చంపేట రూరల్: నాటుసారా కాచినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని సిద్దాపూర్ చౌరస్తాలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. బైక్‌పై 24లీటర్ల నాటుసారా తరలిస్తున్న తార్యను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా పులిజాలలో నీలమ్మ అనే మహిళ ఇంటిలో పోలీసులు ఎనిమిది లీటర్ల సారాను గుర్తించారు. సారాను స్వాధీనం చేసుకొని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్‌కుమార్, సిబ్బంది ఆంజనేయులు, ఆసిఫ్, ఉషారాణి పాల్గొన్నారు.

యువకుడిపై..

ఉప్పునుంతల: అచ్చంపేట మండలం వలపట్లకు చెందిన శివ అనే యువకుడు ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రం నుంచి రెండు కాటన్ల బీరు బాటిళ్లు(24) అక్రమంగా తీసుకెళ్తున్నాడు. పోలీసుల తనిఖీలో మద్యం పట్టుకునట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ స్వాగత ర్యాలీ

అచ్చంపేట రూరల్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అచ్చంపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీ ఫామ్ తీసుకుని పట్టణానికి రానున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు ఘన స్వాగతం ఏర్పాట్లు చేశామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, అమీనొద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని హాజీపూర్ చౌరస్తా నుంచి అచ్చంపేట వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తునట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

అధికారంలోకి వస్తే హామీల అమలు



తాడూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హామీలను తప్పకుండా అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇంద్రకల్‌లో యూత్ డిక్లరేషన్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఆరు గ్యారెంటీ స్కీంలను అమలు చేస్తామన్నారు. సమావేశంలో కర్ణాటక నేషనల్ కార్యదర్శి వివేక్, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి వినోద్‌కుమార్, నర్సింగ్‌యాదవ్, కే రాము, తిరుపతిగౌడ్, మస్తాన్, నానిగౌడ్, తెలకపల్లి జెడ్పీటీసీ సుమిత్ర, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీపీ పర్వతాలు, సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు కిలోల కణితి తొలగింపు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ గర్భసంచి నుంచి మూడు కిలోల కణితిని జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు ఆదివారం తొలగించారు. తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన ఇందిరమ్మ రక్తహీనతతో పాటు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రగతి నర్సింగ్ హోంలో వైద్యులను సంప్రదించింది. పరీక్షించిన వైద్యులు మహిళ గర్భసంచిలో మూడు కిలోల కణతి ఉన్నట్లు గుర్తించారు. లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా కణితిని తొలగించినట్లు సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శస్త్ర చికిత్సలో అనస్తీషియా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ నూర్జహాన్, డాక్టర్ స్వరూపారాణిలు పాల్గొన్నారని పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గిరిజన గురుకులాల ఆర్సీఓ నాగార్జున రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జోనల్‌స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటుగా క్రీడలలో విద్యార్థులు రాణించేందుకు ప్రత్యేకంగా క్రీడల తరగతులు, వ్యాయామ ఉపాధ్యాయుని ప్రత్యేక శ్రద్ధతో ఆటలలో విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో పాల్గొనటమే ఇందుకు నిదర్శనమన్నారు. జోనల్ స్థాయి ఆటల పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.

విజేతలు..

కబడ్డీలో అండర్-14,17,19 విభాగాలలో విజేతలుగా కల్వకుర్తి, తాండూర్, వనపర్తి జట్లు నిలిచాయి. వాలీబాల్‌లో కల్వకుర్తి, అచ్చంపేట, కల్వకుర్తి, ఖోఖోలో అండర్-17,19 విభాగాలలో తాండూర్, కల్వకుర్తిలు గెలుపొందాయి. అథ్లెటిక్ విభాగంలో అండర్-14,17,19లో మహబూబ్‌నగర్, కల్వకుర్తి, తాండూర్, వనపర్తిలు మొదటిస్థానంలో నిలిచాయి. రీజియన్ పరిధిలోని అన్ని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకుర్తి జట్టుకు బహుమతులను అందజేస్తున్న ఆర్సీఓ నాగార్జున రావు

బతుకమ్మలు ఆడిన విద్యార్థులు

విద్యార్థులు, ఉపాధ్యాయులు సరదాగా బతుకమ్మలు ఆడారు. బతుకమ్మ డీజే పాటలకు అణుగుణంగా ఆడిపాడి అందరిని అలరించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



ఊర్కొండ: వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం సాధిస్తుందని మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ అన్నారు. మండలంలో ఊరుకొండపేట ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందన్నారు. మభ్యపెట్టే హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న భూములను అప్పనంగా లాకున్నారన్నాని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, పరశురాములు, కార్యదర్శులు రాజేందర్ గౌడ్, బీజేపీ నాయకులు నరేందర్ గౌడ్, అరవింద్, శ్రీకాంత్ దివాకర్, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలకపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి సతీమణి మర్రిజమున ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి బతుకమ్మ సంబరాలను ప్రారంభించి ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ బతుకమ్మ ఆడి పాడారు. తెలంగాణ సంస్కృతిసాంప్రదాయాలు ఉట్టిపడేలా బొడ్డెమ్మలు వేశారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బైకాని శ్రీనివాస్‌యాదవ్, జెక్కా రఘునందన్‌రెడ్డి, ఈదుల నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేష్, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కోట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు ఆదర్శం



కందనూలు: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అబ్దుల్ కలాం 92వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు కలాం స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సురేష్ బాబు, తిరుపతయ్య, గోపాల్ రెడ్డి, రాజశేఖర్, వెంకటయ్య, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల త్యాగాలు మరువలేం



అచ్చంపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థుల త్యాగాలు మరువలేమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో విద్యార్థి శౌర్య దివస్ భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని గద్దె దించితేనే అందరి భవిష్యత్‌లు బాగుపడుతాయన్నారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకుడు పీవీ మోహన్, జెడ్పీటీసీలు మంత్రియానాయక్, ప్రతాప్‌రెడ్డి, సీఎం రెడ్డి, వంశీకృష్ణ తనయుడు యశ్వంత్, యువ నాయకులు రాజేష్, మల్లేష్, శ్రీనివాసులు, రాజేందర్, గౌరీశంకర్, శేఖర్, మహబూబ్‌అలీ, సునీల్, యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలి

బిజినేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 34 రోజుల పాటు చేసిన సమ్మె కాలపు సంబంధించిన వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లో దసరా పండగ ఉన్నందున తమకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మల్లేష్, లక్ష్మయ్య, కృష్ణయ్య, బాలయ్య, చిట్టెమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందాం

వెల్దండ: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందామని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బైరాపూర్‌లో ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన ప్రధాన వీధుల గుండా ఇంటింట ప్రచారం చేశారు. గ్రామంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్, మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, జోగయ్య, రాజుయాదవ్, జగన్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నిరంజన్, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, అలీ, రాములుయాదవ్, వెంకటయ్య,తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే నిర్లక్ష్యం

కల్వకుర్తి: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిర్లక్ష్యం వల్ల వెనకబాటుకు గురైందని ఎమ్మెల్సీ నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా పార్టీ కార్యాలయం నుంచి పాలమూరు చౌరస్తా వరకు నాయకులంతా ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైరాపూర్‌లో అభివాదం చేస్తున్న నాయకులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com